# మరీచిక

-గన్నవరపు నరసింహమూర్తి

సాయంకాలం. అప్పుడే స్కూలు నుంచి వచ్చిన వేణు పొలానికి వెళ్లడానికి ఆయత్తమవుతున్నాడు. వరి పైరుకి నీరు పెట్టి నాలుగు రోజులవుతోంది. త్వరత్వరగా వెళుతున్న వేణుకి వెంకట్రావు మాష్టారు ఎదురయ్యారు. ఆయన క్రితం సంవత్సరం వేణు పని చేస్తున్న స్కూల్లో హెడ్మాస్టరుగా చేసి రిటైరయ్యారు. ఆయనకి వేణు మేనల్లుడి వరుసవుతాడు.

"ఏరా వేణూ! పొలానికేనా? ఉండు నేనూ వస్తాను. మా పొలాలకీ నీరు పెట్టాలి" అంటూ వేణుతో కలసి బయలుదేరాడు. ఇద్దరూ నడుస్తూ పిచ్చాపాటి మాట్లాడుకోసాగారు.

"అన్నట్లు మర్చిపోయాన్రా! ప్రసాద్ ఎల్లుండి అమెరికా నుంచి వస్తున్నాడు. రెండు సంబంధాలు చూసి ఉంచాను. వాడు వచ్చి ఎవరైనా నచ్చితే వెంటనే పెళ్లి చేసెయ్యాలని అనుకుంటున్నాను. వాడు మళ్లీ నెలరోజుల్లో తిరిగి అమెరికా వెళ్లిపోవాలట. చాలా టైట్ షెడ్యూల్‌తో వస్తున్నాడు."

"చాలా సంతోషం మామయ్యా! వాణ్ని చూసి అప్పుడే నాలుగేళ్లవుతోంది. మరి కొన్నాళ్లు సెలవు పెడితే బాగుండేది'' అన్నాడు వేణు.

"భలేవాడివిరా వేణూ! నెల రోజుల శలవంటే మాటలేమిట్రా? ఇదేం మన హైస్కూలేమిటి మనక్కావలసినన్ని రోజులు సెలవు తీసుకోం దుకు. అయినా ఎక్కువరోజులు సెలవు తీసు కుంటే ఎన్నో లక్షల నష్టం. అందుకే నేనే ఎక్కువ సెలవులు పెట్టవద్దని వాడికి చెప్పాను. అన్నీ మేం సిద్ధం చేసాం. వాడొచ్చి అమ్మాయిని చూసి నచ్చిందని చెబితే చాలు... వారంరోజుల్లో అన్ని పనులూ సరి'' ఉపన్యాస ధోరణిలో చెప్పుకుపో తున్న వెంకట్రావును ఆశ్చర్యంగా చూసాడు వేణు. ఈయనకి డబ్బు పిచ్చి ఇంక వదలదు అనుకున్నాడు. మాట్లాడుకుంటుండగానే వేణు పొలం వచ్చేసింది.

"సరే మామయ్యా! నేనుంటాను'' అంటూ తన పొలంలోని బోరింగ్ షెడ్డు దగ్గరకు వెళ్లాడు వేణు.

వెంకట్రామయ్య తన పొలంవైపు వెళ్లిపో యాడు. బోరింగ్ ఆన్ చేసి వెంబడి నీళ్లు చూసుకుంటూ పొలం చుట్టూ తిరిగాడు. కొద్దిసే పటికి తిరిగి షెడ్డు దగ్గరకొచ్చి కుర్చీలో కూర్చుని ఆలోచించసాగాడు.

గోధూళి వేళ కావడంతో అంతా నిర్మాను ష్యంగా ఉంది. పడమర దిక్కు సింధూర వర్ణాన్ని సంతరించుకుంటోంది. హేమంతం కావడంతో చల్లని గాలులు వణికిస్తున్నాయి. కనుచూపుమే రలో హరిత వర్ణపు పొలాలు పచ్చని తివాసీలా కనువిందు కలిగిస్తున్నాయి. వేణుకి ఆ దృశ్యాన్ని చూస్తుంటే సమయమే తెలియదు. అతనికి చిన్నతనం నుంచి తన ఊరంటే ఎంతో ఇష్టం. ఈ ప్రశాంతత, కల్మషంలేని మనుషులు, అమాయ కంగా పారే ఏరు ఇంకెక్కడా దొరకదని అతని నమ్మకం. అతనికి బాల్యం గుర్తుకొచ్చింది. స్కూల్లో అతనెప్పుడూ ఫస్టే. వెంకట్రావు మాష్టారు అదే తన మామయ్య కొడుకు ప్రసాద్ తనకు పోటీ. తను చదువుకుంటూ తండ్రికి సాయం చేస్తుండేవాడు వేణు. పరీక్షలప్పుడు పొలం గట్లమీద, చేలు కోసినప్పుడు బోరింగ్ షెడ్డు దగ్గర చదువుకునేవాడు.

వెంకట్రావు మామయ్యకైతే తన కొడుకు ఈ పల్లెటూరి జిల్లా పరిషత్ హైస్కూల్లో చదివితే ఎందుకూ పనికిరాడని ఎనిమిదో తరగతికి రాగానే ప్రసాద్‌ని దగ్గరలో వున్న పట్నంలోని ఒక ప్రైవేటు స్కూల్లో చేర్పించాడు. అతనికి కొడు కును ఎలాగైనా ఇంజనీర్ని చేసి అమెరికా పంపా లని కోరిక. అందుకోసం ఎనిమిదో తరగతి నుంచే ప్రయత్నాలు ప్రారంభించాడు.

ఇంటర్మీడియెట్ తరువాత ఎమ్‌సెట్లో ప్రసా ద్‌కి మంచి రాంక్ రాకపోయినా డొనేషన్ కట్టి ఇంజనీరింగ్‌లో జాయిన్ చేసాడు. వేణుకి మొద ట్నించీ టీచరవ్వాలని కోరిక. పరుగెత్తి పాలు కన్నా నిలబడి నీళ్లు మిన్న అన్న భావం కల వాడు కాబట్టే బియస్సీ చేసి బిఇడి పూర్తి చేసాడు. ఆ సంవత్సరం జరిగిన డియస్సీలో సెలక్టై తన ఊళ్లో అందునా తను చదివిన స్కూల్లోనే సైన్స్ టీచర్‌గా జాయినయ్యాడు. ప్రసాద్ మాత్రం ఇంజనీరింగ్ తరువాత ఉద్యోగం చేస్తానంటే వెంకట్రావుగారు ససేమిరా వీల్లేదన్నారు. అతన్ని ఎమ్మెస్ చదవడానికి అమె రికా పంపాడు. దానికోసం ఇరవైలక్షలు ఖర్చ యింది. తన పొలం అమ్మి మరీ కొడుకును అమె రికా పంపాడాయన.

అతనికి కొడుకు చదువు ఎప్పుడు పూర్తవు తుందా, ఎప్పుడు ఉద్యోగంలో చేరి డాలర్లు పంపిస్తాడా అని ఎదురు చూస్తుండేవాడు.

వేణు మాత్రం ఉన్న ఊళ్లో టీచరుగా పేరు సంపాదించుకున్నాడు. తండ్రికి అండగా ఉంటూ ఒక్కగానొక్క చెల్లెలికి మంచి సంబంధం చూసి పెళ్లి చేసాడు.

ఆలోచనల్లోంచి తేరుకున్న వేణు చీకటి పడ డంతో ఇంటి దారి పట్టాడు. మరో రెండురోజు లకు పెళ్లి నిమిత్తం ప్రసాద్ అమెరికా నుంచి వచ్చాడు.

★★★

ప్రసాద్ పెళ్లి ఆడంబరంగా జరిగిపోయింది. పెళ్లయిన వారం రోజులకే అతను భార్యతోసహా అమెరికా వెళ్లిపోయాడు.

అతను వెళ్లిన నెలరోజులకి వెంకట్రావుగారికి బాగా సుస్తీ చేసింది. ఆయన మొదటినుంచీ బ్రోంకైటిస్ వ్యాధితో బాధపడుతుండేవాడు. శీతా కాలం కావడంతో అది మరింత ముదిరి శ్వాస తీసుకోవడం కష్టమైపోయింది. దానికితోడు కఫం చేరడంతో ఆయన్ని వేణు దగ్గర్లోని పట్నంలోని హాస్పిటల్‌లో జాయిన్ చేసాడు.

వెంకట్రావుగారు, వేణుతో ఈ విషయం ప్రసాదేకి తెలియపరచవద్దని, కొంత డబ్బు మాత్రం పంపమని మెసేజ్ ఇవ్వమన్నాడు. వేణు అతనికి ఫోన్ చేసి డబ్బు అవసరం పడిందనీ, త్వరగా పంపమనీ చెప్పాడు.

కానీ ప్రసాద్ ఇప్పుడు కొత్తగా సంసారం వల్ల తాను కొద్దిగా ఇబ్బందుల్లో ఉన్నాననీ, వేణుని సర్దమని చెప్పడంతో హాస్పిటల్ ఖర్చు అంతా వేణూనే భరించాడు. పదిహేను రోజుల తరువాత వెంకట్రావుని డిశ్చార్జి చేసారు. ఇప్పుడతని ఆరోగ్యం కొంచెం కుదుటపడింది. ఈ పదిహేను రోజులు వేణు కుటుంబం అంతా వెంకట్రావు కుటుంబాన్ని ఆదుకున్నారు.

★★★

మరో పదిహేనురోజుల తరువాత ప్రసాద్ నుంచి ఉత్తరంతోపాటు వేణుకి ఇవ్వవలసిన డబ్బుకి డీడీ వచ్చాయి. ఆ ఉత్తరాన్ని వేణు చదవసాగాడు. అది చాలా సుదీర్ఘంగా ఉంది.

"ప్రియమైన వేణుకి

ప్రసాద్ వ్రాయునది. మా నాన్నగారికి ఒంట్లో బాగాలేదనే సంగతి, దానికి నువ్వు చేసిన సహాయం ఈమధ్యనే తెలిసింది. అందుకు నీకు సదా నా కృతజ్ఞతలు. మా నాన్నగారి స్వార్థంవల్ల నా జీవితం ఇలా అయిపోయింది. అవసర సమయంలో నేను నా కుటుంబాన్ని ఆదుకోలేకపోయాను. నాకు అమెరికాలో ఉద్యోగం వచ్చిన



దగ్గర్నుంచీ నన్ను డబ్బు పంపే యంత్రంగానే మా ఇంట్లో అందరూ చూస్తున్నారు. వేణూ! మొన్న మన ఊరు నా పెళ్లికి వచ్చినప్పుడు నీ జీవితాన్ని చాలా దగ్గరగా గమనించాను. నీ జీవితాన్ని అందంగా తీర్చిదిద్దుకోవడానికి నువ్వు తీసుకున్న నిర్ణయాన్ని మా నాన్నగారి స్వార్థంవల్ల నేను తీసుకోలేకపోయాను. దానివల్ల నేను చాలా కోల్పోయాను. ప్రశాంతమైన మన పల్లెలో నువ్వు గడుపుతున్న ఆనందకరమైన జీవితాన్ని చూస్తుంటే నేను జీవితంలో ఎంత పెద్ద తప్పు చేసానో ఇప్పుడర్థమవుతోంది.

ఇక్కడ నేను ఇరవై లక్షలు ఖర్చు పెట్టి చదివినా నా ఉద్యోగానికి స్థిరత్వం లేదు. అదీగాక మనల్ని వీళ్లు డబ్బు కోసమే వచ్చామని చాలా చిన్న చూపు చూస్తుంటారు. అదీగాక మేము డబ్బు కోసమే ఇక్కడకు వచ్చాం కాబట్టి నాలాంటివాళ్లు ఎంతో విలువైన జీవితాన్ని అనుభవించకుండా ఎంతో కోల్పోతున్నాం. నా భార్యకి కూడా నా ఉద్యోగం, జీవితం చూసి అసంతృప్తిగా ఉంది. బహుశా ఇంత డబ్బు పోసి కొనుక్కున్న అమెరికా మొగుడి హోదా ఆమెకు నచ్చలేదేమో! ఇప్పుడిప్పుడే మా సంసారంలో కలతలు మొదలవుతున్నాయి. ఎప్పుడైతే పెళ్లిళ్ళు డబ్బు, హోదా ప్రాతిపదికలపై జరుగుతాయో అప్పుడు ఇటువంటి ఘర్షణలు తప్పవు. నిజంగా మనసులు కలసి పెళ్లి చేసుకుంటే ఇటువంటివి ఎదురుకావు. ఇంక జీవితం అంతా ఇద్దరం అసంతృప్తితో బ్రతకవలసిందే. మన దేశం వచ్చేద్దామంటే నాకు అక్కడ సరైన ఉద్యోగం దొరకదు సరికదా మా నాన్నే ఒప్పుకోడు. అంతెందుకు నా భార్యే ఒప్పుకోదు. వాళ్ల వాళ్లు ఒప్పుకోరు. ఎందుకంటే వీళ్లందరికీ నేను అమెరికాలో ఉండాలి. నేను అమెరికా కొడుకుగా, భర్తగా, అల్లుడిగా మిగిలిపోవాలి.

నిజంగా నేను అమెరికా వచ్చి చాలా తప్పు చేసాను. ఆ రోజు నాకు జీవితంపట్ల సరైన అవగాహనలేదు. మా నాన్న చాలా స్వార్థపరుడు. నేను అమెరికా వెళితే డబ్బులు బాగా సంపాదిస్తాననీ, తద్వారా తన జీవితం హాయిగా గడిచిపోతుందనీ ఆలోచించాడు. కానీ ఇప్పుడేం జరిగింది? ఎప్పుడైనా కన్న తల్లిదండ్రులకు ఈ వృద్ధాప్యంలో ఒంట్లో బాగాలేకపోతే ఆదుకోలేనంత దూరంగా ఉన్నాను. అలా అనీ మాటిమాటికీ వస్తే డబ్బుతోపాటు ఉద్యోగం కూడా ఊడడం ఖాయం. అందుకే దూరం అనే ముసుగు వేసుకుని మనసు రాయి చేసుకుని నీలాంటి మంచి స్నేహితుల అండతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాను. పూర్వం నీలాంటి తెలివైన విద్యార్థులు మాత్రమే అమెరికా వచ్చేవారు. కానీ ఈనాడు నాలాంటి అర్హత లేనివాళ్లు డబ్బుతో అమెరికా చదువును కొనుక్కుంటూ దాన్నో వ్యాపారం చేసేసారు. వరుడు మన దేశంలో పనిచేస్తే ఎన్నో ఆరాలు తీసే అమ్మాయి తల్లిదండ్రులు అమెరికాలో ఉంటే మాత్రం అవేం అక్కర్లేదు. కానీ ఆ తరువాత వాళ్లు పడే కష్టాలు వాళ్లకక్కర్లేదు.

ఇక్కడ మా బ్రతుకులు సాఫీగా సాగాలంటే మేమిద్దరం రోజుకి పన్నెండు గంటలు కష్టపడాలి. ఆ సంపాదించిన డబ్బు కూడా స్వేచ్ఛగా ఖర్చు పెట్టే వెసులుబాటు మాకు లేదు. దాన్ని జాగ్రత్తగా పొదుపు చేయాలి. ఎందుకంటే మా భవిష్యత్ మా చేతిలో లేదు. ఇంతటి అందమైన అద్దాల మేడలో నేను బ్రతుకుతున్నాను. ఇక్కడ నా సంపాదన ముప్పాతికకు పైగా ఇంటి అద్దెలకు, కార్లకు, బ్రతకడానికే సరిపోతుంది. ఇంక విలాసాలెక్కడ? అందుకే ఆ రోజు నాన్నగారి కోసం డబ్బు పంపమన్నప్పుడు నేను పంపలేకపోయాను. ఎందుకంటే అప్పటికి నాది కొత్త సంసారం. నా భార్యకు ఉద్యోగంలేదు. ఇప్పుడైతే ఆమె పరిస్థితులకు రాజీపడి ఉద్యోగం చేసుకుంటోంది. ఆమెకి అమెరికా కలలు రానురాను కరిగిపోతున్నాయి. నేనే కాదు నాలాంటివాళ్లు చాలామంది అమెరికా అనే మరీచికను చూసి భ్రమపడి ఇక్కడకొస్తున్నారు. విలువైన తమ జీవితంలో ఆనందాన్ని కోల్పోతున్నారు. తద్వారా మన భాషకి, సంస్కృతికి, నైతిక విలువలకు తిలోదకాలిస్తున్నారు. అమెరికాలో నేను వెలగబెడుతున్న జీవితం తద్వారా నా అంతర్మథనాన్ని పంచుకోవాలనే ఈ సుదీర్ఘమైన ఉత్తరాన్ని వ్రాస్తున్నాను. సకాలంలో మా కుటుంబాన్ని ఆదుకున్నందుకు మరోసారి కృతజ్ఞతలు చెబుతూ ఆ అవసరం చాలాసార్లు రావచ్చునని, అన్నిసార్లు నువ్వు ఆదుకుంటావనీ ఆశిస్తూ

నీ ప్రియ మిత్రుడు

ప్రసాద్''

ఆ ఉత్తరం చదివిన వేణుకి కళ్ళు చెమర్చాయి. నిజంగా మానవుడు నిరంతర అన్వేషి. ఏదో కొత్తదనాన్ని వెతుక్కోవాలని నిరంతరం మరీచిక వెంట పరుగులెత్తుతుంటాడు. కానీ బాధాకరమైన విషయం ఏమిటంటే అవి మరీచికలని తెలియకపోవడమే!

★

## ఏనుగు భయపడేది

ఏనుగులకి చిట్టెలుకలంటే భయమని ఇంతకాలం శాస్త్రజ్ఞులు భావించేవారు. కానీ, వారి ఇటీవల పరిశోధనల్లో అవి కుందేళ్ళంటే భయపడతాయని తెలిసిందిట!

## కాపలా వాళ్ళకి శిక్ష

మెక్సికోలోని ఆల్మోస్‌లో జైలునుంచి ఖైదీ కనుక తప్పించుకుని పారిపోతే అతనికి మిగిలిన శిక్షా కాలాన్ని కాపలావాళ్ళు జైలు శిక్షగా అనుభవించాల్సి వస్తుందిట!

## చాక్లెట్ తిన్న నెపోలియన్

నెపోలియన్ తన జీవితంలో ఎక్కువకాలం యుద్ధాలతో గడిపాడు. యుద్ధభూమిలో నీరసమనిపించినప్పుడల్లా శక్తిని పుంజుకోటానికి చాక్లెట్‌ని ఎక్కువగా తినేవాడట!

-విమలారామం

